క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నేత శ్రీధర్

దెందులూరు: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళగిరిలో గాలాయగూడెం వైఎస్సార్‌సీపీ నేత, పంచాయతీ వార్డు మెంబర్ కొండపల్లి శ్రీధర్ మంగళవారం కలిశారు. పార్టీ అభివృద్ధికి క్షేత్రస్థాయిలో కృషి చేయాలని, నాయకులు, కార్యకర్తలందరికీ పార్టీ అండగా ఉంటుందని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారని శ్రీధర్ తెలిపారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



గాలాయగూడెంలో అయ్యప్ప పడిపూజ చేస్తున్న మాలధారులు

దెందులూరు: గాలాయగూడెంలో పూజారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు భక్తిశ్రద్ధలతో మంగళవారం అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. పడిపూజలో పూలతో అలంకరించిన భారీ శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పడి పూజలో ముఖ్యమైన 18 మెట్లను పూలు, పండ్లతో ప్రత్యేకంగా తయారు చేశారు. కార్యక్రమంలో గురు స్వాములు, మాలధారులు భక్తి గీతాలు ఆలపించి పూజలు చేశారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.


మహిళా సాధికారతపై చర్చ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఓ అనురాధ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మహిళా సాధికారత అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు హేలాపూరి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పీవీ రమణ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్‌బాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనురాధ హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా సీఆర్ఆర్ కాలేజ్ అధ్యాపకురాలు ఎస్ హేమలత, సెయింట్ ఆన్స్ కాలేజ్ అధ్యాపకురాలు పి.జ్యోతి కుమారి, లయన్స్ క్లబ్ ప్రతినిధి కె.విష్ణు ప్రియ పాల్గొన్నారు.

సబ్సిడీపై రుణాలు అందించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీలకు సబ్సిడీ రుణాలు అందించాలని దళిత సేన ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ కోరారు. స్థానిక ఆర్ఆర్ పేటలోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన ఏలూరు జిల్లా, ఏలూరు నగరం మహిళా కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ నాయకత్వంలో మాలల అభివృద్ధికి సమర్థవంతంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. ఇటీవల మాలల కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన పెదపూడి విజయ్ కుమార్‌కి శుభాకాంక్షలు తెలిపారు. మాలల ఆర్థిక అభివృద్ధికి విజయ్ కుమార్ కృషి చేయాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరి ష్కారానికి సహకరించాలని డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మను ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియషన్ నాయకులు కోరారు. నూతనంగా ఏర్పడిన అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం డీఈఓను ఆమె కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీజేఏ స్టీవెన్ మాట్లాడుతూ స్కూలు పనివేళలో మార్పులు చేయరాదని, పాత సమయాలని కొనసాగించాలని, అపార్ నమోదు విషయంలో ప్రధానోపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయకుండా, వెసులుబాటు కల్పించాలని దీనిపై ఉన్నతాధికారులకు నివేదించాలని డీఈఓను కోరారు.

బెంబేలెత్తిస్తున్న శునకాలు

- ఎక్కడ చూసినా పదుల సంఖ్యలో గుంపులుగా స్వైరవిహారం
- ప్రయాణికులపై దాడి
- భయాందోళన నడుమ రాకపోకలు సాగిస్తున్న ప్రజలు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



పెదపాడు వీధిలో సంచరిస్తున్న శునకాలు (ఫైల్)

పెదపాడు: గ్రామాల్లో రహదారులపై గుంపులుగా మాటు వేస్తున్న శునకాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఎక్కడ చూసినా రోడ్లపై పదుల సంఖ్యలో శునకాలు దర్శనమిస్తున్నాయి. పెదపాడు, కొత్తూరు, అందేఖాన్ చెరువు, గుడిపాడు, నాయుడుగూడెం, అప్పనవీడు, తదితర ప్రాంతాల్లో శునకాల సంఖ్య అధికంగా ఉంటోంది. రాకపోకలు సాగించే ప్రయాణీకుల వెంటపడుతూ దాడి చేస్తున్నాయి. వాటి బారి నుంచి తప్పించుకునేందుకు ప్రజలు పరుగులు తీయిస్తున్నారు. పగలూ రాత్రి తేడా లేకుండా నివాసాల మధ్య కుక్కలు కలియ తిరుగుతూ పాదచారులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. కుక్కల దాడికి భయపడి విద్యార్థులు, మహిళలు భయపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. కొత్తూరు, పెదపాడు, రామచంద్రపురం, అందేఖాన్ చెరువు ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రహదారిపై వెళ్తున్న వాహనదారుల వెంట పడుతున్నాయి. కుటుంబ సభ్యులతో ద్విచక్రవాహనంపై వెళ్లే వారిని శునకాలు వెంబడించడంతో పలువురు భయాందోళనకు గురై వాహనాన్ని అదుపు చేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్నేళ్లుగా గ్రామాల్లో కుక్కల సంచారం పెరిగింది. ఈ సమస్యపై స్థానికులు అధికారులకు విన్నవించుకుంటున్నా ఫలితం లేకపోయిందని పలువురు వాపోతున్నారు. శునకాల నియంత్రణకు గ్రామ పంచాయతీలు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. కొన్నిచోట్ల కుక్కలను బంధించి వాటిని వేరే గ్రామం శివారున వదిలిపోతున్నారు.దీంతో శునకాల బెడద యథావిధిగా కొనసాగుతోంది.

వీధి కుక్కలను నియంత్రించాలి

వీధి కుక్కలతో ఇబ్బందులు పడుతున్నాం. వచ్చిపోయే దారిలో ప్రయాణికుల వెంట పడుతూ పరుగులు పెట్టిస్తున్నాయి. గుంపులుగా ఉంటున్న శునకాలు ఎక్కడ మీద పడతాయోనన్న భయంతో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. పెదపాడు- వంగాయగూడెం రహదారి వెంబడి కుక్కలు స్వైరవిహారం ఎక్కువగా ఉంది. అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించాలి.

– ఎం. రాంబాబు, పెదపాడు

అందుబాటులో పెసర, మినుము విత్తనాలు

పెదపాడు: రైతులకు రైతు సేవా కేంద్రంలో పెసర మినుము, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని వసంతవాడ, గోగుంటలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు, వసంతవాడ వెటర్నరీ వైద్యుడు ఎం గోవిందరావు, వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

30న సెమీ క్రిస్మస్ వేడుకలు

దెందులూరు: కొవ్వలి సాల్వేషన్ ఆర్మీ చర్చిలో ఈ నెల 30న సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తామని సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ మేజర్ కే సుబ్బారావు, మేరీ కుమారి తెలిపారు. ముఖ్య అతిథులుగా సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ కమాండర్ మేజర్ కేమోషే, మేజర్ జి మేరీకుమారి హాజరవుతారని తెలిపారు. సంఘ విశ్వాసులు, సంఘ పెద్దలు, సభ్యులు విశ్వాసులు సెమీ క్రిస్మస్ వేడుకలకు హాజరుకావాలని మేజర్ కే సుబ్బారావు కోరారు.

మహిళలు మరింత చైతన్యవంతులు కావాలి



ఇందిరాగాంధీ జయంత్యుత్సవంలో పాల్గొన్న డీవైఈవో రవీంద్రభారతి, వెటర్నరీ డాక్టర్ శిరీష



గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు



మహిళా సాధికారతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి రాంబాబు

దెందులూరు: మహిళలు విద్యావంతులై సమాజంలోని అన్ని రంగాల్లో రాణించేందుకు, మరింత చైతన్యవంతమైన పాత్ర పోషించేందుకు సిద్ధం కావాలని పోతునూరు ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం సుభాషిని, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అన్నారు. మంగళవారం పోతునూరు గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా గ్రంథాల అధికారి రాంబాబు అధ్యక్షతన మహిళా సాధికారతపై అవగాహన సమావేశం నిర్వహించారు. మహిళా సాధికారతపై విద్యార్థులతో డిబేట్ కార్యక్రమం నిర్వహించారు.

మహిళా సాధికారతతో అభివృద్ధి

దెందులూరు: మహిళా సాధికారతతోనే నూరు శాతం అభివృద్ధి సాధ్యమవుతుందని దెందులూరు గ్రంథాలయం అధికారి ఝాన్సీ రాణి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆమె మహిళా సాధికారిక అంశంపై ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో దెందులూరు గారపాటి హైమావతీ దేవి, ఉన్నత పాఠశాల బాలికలు పాల్గొన్నారు.

ఉంగుటూరు శాఖ గ్రంథాలయంలో ..

ఉంగుటూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉంగుటూరు శాఖా గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో రవీంద్రభారతి, ఆయుర్వేద డాక్టర్ శిరీష, పశువైద్యాధికారి శిరీష, మాజీ సర్పంచి దొంతంశెట్టి సత్యనారాయణ, లైబ్రేరియన్ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ఇందిరాగాంధీ కృషి

భీమడోలు: పేదరిక నిర్మూలన లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన భారత తొలి మహిళా ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ సేవలు మరవలేనివని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆరరోజైన మంగళవారం భీమడోలు, పూళ్ల, గుండుగొలను గ్రంథాలయాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత ఇందిరాగాంధీ 107వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి గ్రంథాలయాధికారులు, అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలికలకు పాటలు, మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్, వ్యాస రచన పోటీలను నిర్వహించారు. మానవత సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా ప్రతినిధి పోలిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, రిటైర్డ్ హెచ్‌ఎం పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలి

పెదపాడు: పెదపాడు శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత ప్రాధాన్యతపై ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాస్ ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, వకృత్వ పోటీలు నిర్వహించారు.

రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

కలెక్టర్ కె. వెట్రిసెల్వి



రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కె. వెట్రిసెల్వి

దెందులూరు: సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నాణ్యత లోపిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మంగళ వారం దెందులూరు మండలం మలకచర్ల, కంద్రిగ నరసింహాపురంలో చేపట్టిన సీసీ రోడ్ల పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీసీ రోడ్ల నిర్మాణానికి రూపొందించిన మార్గదర్శకాలను కాంట్రాక్టర్లు, అధికారులు పాటించాలన్నారు. రోడ్డు నిర్మాణ పనులను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. రోడ్డు నిర్మాణంలో ఉపయోగించే సామగ్రి, రోడ్డు వెడల్పు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు.

కలెక్టర్‌కు వినతిపత్రం: కలెక్టర్ వెట్రిసెల్వికి కంద్రికనరసింహపురం మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు జాతీయ రహదారిపై సగం మాత్రమే వేసిన విద్యుత్తు లైను రైల్వే ట్రాక్ వరకు పూర్తి చేయాలని, హైవేపై మెట్ల వద్ద ఆకతాయిలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కలెక్టర్ వెంట దెందులూరు తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీఓ కే.శ్రీదేవి, ఆర్అండ్‌బీ ఏఈ శేషు కుమార్, ఉద్యోగులు ఉన్నారు.

హమాలీల వేతనాలు పెంచాలని ధర్నా



పాతూరు గోడౌన్ వద్ద ధర్నా చేస్తున్న చేస్తున్న హమాలీలు

భీమడోలు: సివిల్ సప్లయిస్ గోదాముల్లో పని చేసే హమాలీల వేతనాలు తక్షణమే పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పాతూరు గోదాము వద్ద ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసుకున్న ఒప్పందం 2024 జనవరిలో ముగిసిందన్నారు. అనంతరం వేతనాలు పెంచాల్సిన కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రెండేళ్లకు ఒకసారి చేసుకునే వేతన ఒప్పందం ముగిసినందున ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్‌తో చర్చలు జరిపి హమాలీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. మండల అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, పాతూరు గోదాం యూనియన్ అధ్యక్షుడు ఎం.రాము, నాయకులు జి.నాగేశ్వరరావు, త్రినాధరావు, హమాలీలు పాల్గొన్నారు.

రజక వృత్తి చెరువుల సర్వే చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు (టూటౌన్): రజక వృత్తిదారుల చెరువులను సమగ్ర సర్వే చేయించి హద్దులు నిర్ణయించి, లీజులు నిర్ధారించాలని రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. స్థానిక జిల్లా రజకజన సంఘ కార్యలయంలో మంగళవారం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ద్వారకాతిరుమల, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలం నుంచి రజకు విచ్చేసి తమ సమస్యలపై మాట్లాడారు. గ్రామాల్లో రజకుల వృత్తి చెరువులు ఆక్రమణలో ఉన్నాయని, రజకుల చెరువులు లీజు విధానంలో కొన్నిచోట్ల ఎక్కువ లీజుల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ జీఓ 49 ప్రకారం చెరువుల లీజు నిర్ధారించేటప్పుడు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో చెరువుల విస్తీర్ణాన్ని కొలతలు వేసి పరిగణలోనికి తీసుకోవాలని కోరారు. కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంలో రజకుల కేటాయించిన పరమేశ్వరి చెరువు వద్ద నిర్మించిన విశ్రాంతి భవనం శిథిలమైందన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 200 విశ్రాంతి భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, గతంలో ఇచ్చిన ప్రభుత్వం జీఓ ప్రకారంగా ప్రతి విశ్రాంతి భవనానికీ మూడు లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొమ్మంటి మురళి, జిల్లా ఉపాధ్యక్షురాలు మెట్ట లక్ష్మీ ప్రసన్న, వి.శ్రీనివాసు, బయ్యనగూడెం రజక నేతలు కోమటికుంట లక్ష్మణరావు, కోమటికుంట సుబ్బారావు, కుక్కిరిపాటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి మాసగిరి శ్రీనివాసరావు కృషి

దెందులూరు: ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఏలూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాసగిరి శ్రీనివాసరావు నియమించినట్టు రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జీజేఏ స్టీవెన్ అన్నారు. మంగళవారం నూతన కమిటీని నియమించామన్నారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ గోపన్నపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సీనియర్ తెలుగు ఉపాధ్యాయుడు ఉపాధ్యాయుడిగా శ్రీనివాసరావు విద్యారంగ సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తి అని అన్నారు. తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాటి వెంకటరమణ, తోట ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు వర్ల గంగాధరరావు తదితరులు శ్రీనివాసరావు అభినందించారు.

మిషన్ శక్తి పథకంపై అవగాహన సదస్సు

ఉంగుటూరు: మహిళా శిశు సంక్షేమ, సాధికారిత శాఖ ఆధ్వర్యంలో ఉంగుటూరులో మంగళవారం మిషన్ శక్తి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో కేపీఏఎస్ విజయలక్ష్మి, వన్‌స్టాప్ సెంటర్ పేరా లీగల్ లాయర్ కృష్ణవేణి మిషన్ శక్తి పథకంలో ఉన్న స్కీమ్‌లు, వన్‌స్టాప్ సెంటర్ ద్వారా మహిళలు, బాలలకు అందుతున్న సేవలు, కౌన్సెలింగ్, న్యాయపరమైన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో పి.తిరుపతమ్మ, ఐసీడీఎస్ శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ, ఆశా, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించాలి



స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్‌లో పాల్గొన్న పీఈటీలు

దెందులూరు: ఆధునిక పద్ధతులను వినియోగించుకుని విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించి అత్యుత్తమ క్రీడాకారులుగా వ్యాయామ ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎం సత్యనారాయణ అన్నారు. మంగళ వారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి ఎల్‌వీడీ రవి బాబు ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించారు. కాంప్లెక్స్‌లో చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో భావితరాలకు ప్రతిభా నైపుణ్యాలతో రాణించేలా విద్యార్థులను ప్రాథమిక స్థాయి నుంచి ప్రణాళికతో తీర్చిదిద్దాలన్నారు. నియోజకవర్గ స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి మేధినరావుపాలెం ఉన్నతపాఠశాల ఫిజి కల్ డైరెక్టర్ ఎల్‌వీడీ రవిబాబు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కాంప్లెక్స్ శిక్షణ తరగతుల్లో దెందులూరు నియోజకవర్గంలోని పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్లు పీయూటీలు హాజరయ్యారు.

ఆటల్లో రాణించడం అభినందనీయం



విజేతలైన న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తంకుమార్

ఏలూరు (టూటౌన్): న్యాయవాదులు ఆటల్లోనూ రాణించడం అభినందనీయమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ అన్నారు. ఏలూరు బార్ అసోసియేషన్‌లో ఇంటర్నేషనల్ పురుషుల దినోత్సవ కార్యక్రమాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారామ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టులోని న్యాయవాదులకు వాలీబాల్, క్యారమ్స్‌లో పోటీలు నిర్వహించారు. ముగ్గురు సీనియర్ న్యావాదులను సన్మానించారు. ఆటల్లో విజేతలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం వృత్తిపరమైన ఒత్తిళ్లతో ఉండే న్యాయవాదులు ఆటవిడుపుగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

విజేతలు వీరే..

వాలీబాల్‌లో పి.తంబి, రాజేష్, అశోక్, టి.వి కాస్, లోహిత్, కె.యశ్వంత్, టి.కిరణ్, క్యారమ్స్‌లో కె.శ్రీకాంత్, నాగేశ్వరరావులు బహుమతులు అందుకున్నారు. సీనియర్ న్యాయవాదులు ఎంవీ నంద కుమార్, ఎస్‌వీఆర్ గాంధీ, సీఏపీఎస్‌లను సన్మానించారు. కార్యక్రమాల్లో పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో మరుగుదొడ్ల పాత్ర కీలకం



వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నారాయణపురంలో మంగళవారం వరల్డ్ టాయిలెట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో మరుగుదొడ్ల పాత్ర కీలకమైందని, వాటిని శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన నారాయణపురం సర్పంచ్ దిడ్ల అలకనంద శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణంతోపాటు మరుగుదొడ్ల నిర్మాణం ముఖ్యమని, ప్రభుత్వం ఆర్థికంగా సహాయం అందించి మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత గ్రామంగా నారాయణపురాన్ని తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం కళాశాల విద్యార్థులు నారాయణపురంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించారు. నాయకులు దిడ్ల శ్రీనివాస్, పంచాయతీ గ్రామ కార్యదర్శి నేతల విజయ్‌కుమార్, గ్రామ పారిశుద్ధ్య కార్మికులు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, కళాశాల హెల్త్ అండ్ హైజీన్ క్లబ్ కోఆర్డినేటర్ ఆయేషా, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ హెప్సీబా, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డి.రెడ్డియ్య, అకడమిక్ కో–ఆర్డనేటర్ కొండ రవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టబద్ధ దత్తతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీసీపీఓ సూర్యచక్రవేణి

ఏలూరు (టూటౌన్): చట్టబద్ధమైన దత్తత పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా బాలల సంరక్షణాధికారి సూర్యచక్రవేణి తెలిపారు. స్థానిక జాలిపూడి ఏరియాలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ (శిశు గృహ) ద్వారా దత్తత కార్యక్రమాలను మిషన్ వాత్సల్యలో భాగంగా జరుగుతుంటాయన్నారు. నవంబర్ మాసాన్నంతటినీ దత్తత మాసోత్సవంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దత్తతకు అర్జీలు చేసుకునే తల్లిదండ్రులకు, మహిళా సంరక్షణ కార్యదర్శిలకు చట్టబద్ధమైన దత్తత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వద్దనుకున్న తమ పిల్లలను ఊయల ప్రోగ్రాం ద్వారా లేదా 1098కి ఫోన్ చేసి సంరక్షించడానికి సమాచారం అందించాలన్నారు. డీసీపీయూ సిబ్బంది లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసరు, జాహ్నవి ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీకాంత్, శిశు గృహ మేనేజర్ భార్గవి, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కోఆర్డినేటర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించాలి

ఏలూరు(మెట్రో): వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. డబ్ల్యూఎస్ఎం (డిస్ట్రిక్ట్ వాటర్ శానిటేషన్ మిషన్) జిల్లా స్థాయి కమిటీ సమావేశం జేసీ అధ్యక్షతన మంగళవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో నిర్వహించారు. కమిటీకి కన్వీనర్‌గా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వ్యవహరించగా, మరో 10 శాఖల జిల్లా అధికారులు కమిటీలో సభ్యులుగా ఉన్నట్టు జేసీ ప్రకటించారు. వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల వినియోగంపై డబ్ల్యూఎస్ఎం ప్రచురించిన అవగాహన వాల్ పోస్టర్‌ను జేసీ విడుదల చేశారు. వరల్డ్ టాయిలెట్ డేను పురస్కరించుకుని మంచి పారిశుద్ధ్య సేవలు అందిస్తున్న పలువురు క్లాప్ మిత్రులను జేసీ సత్కరించారు. ఈ నెల 19 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. డిసెంబర్ 5 నుంచి 9వ తేదీ వరకు పరిశుభ్రమైన మరుగుదొడ్లను గుర్తించి నిర్వహణ, పర్యవేక్షణపై అవార్డులు ప్రదానం చేస్తామని చెప్పారు.

రూ.99.05 కోట్ల ధాన్యం కొనుగోలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఇప్పటివరకు రూ.99.05కోట్ల విలువైన 43,004.880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేసి, రైస్ మిల్లులకు తరలించామని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. క్వింటాలుకు కనీస మద్దతు ధర కామన్ రకం రూ.2,300, గ్రేడ్ ఏరకం రూ.2,320 చొప్పున ధాన్యం కొంటున్నామని, రైసు మిల్లు తరలించిన 48 గంటల్లోపే రైతు ఆధార్ అనుసంధానిత బాంకు ఖాతాలో సొమ్ము జమయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోలుపై సందేహాలు, ఫిర్యాదులను జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ (ఫోన్ నెంబర్లు 08812 - 230448, 77020 03584, లేదా టోల్ ఫ్రీ 18004256453)కు ఫోన్ చేయవచ్చన్నారు.